క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11.30గంటలకు నిర్వహించనున్న సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహించనున్నట్లు చెప్పారు.

'స్పందన'కు పది అర్జీలు

తెనాలి: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశానికి మొత్తం పది అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ అడంగళ్ సవరణలు కోరుతూ ఇద్దరు అర్జీలు సమర్పించగా, ఆక్రమణలపై ఇద్దరు ఫిర్యాదు చేశారు. రేషను కార్డు ఇప్పించాలంటూ రెండు అర్జీలు రాగా, దివ్యాంగ పింఛను కోరుతూ ఒకరు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వర్తింపజేయాలంటూ మరొకరు దరఖాస్తులు అందజేశారు. కరెంటు తీగెలు సమస్యాత్మకంగా ఉంటున్నాయని, శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం సమస్యలు పరిష్కరించాలంటూ మొత్తం మూడు అర్జీలు దాఖలైనట్లు వివరించారు. ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న స్పందన సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గీతాంజలి శర్మ సూచించారు.

నిరుపేదలకు అన్నదానం

తెనాలి టౌన్: రైల్వేస్టేషన్ సెంటర్ వద్ద నిరుపేదలకు శివలింగేశ్వర భక్తబృందం, శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కఠెవరం మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, కుర్రా శ్రీను పాల్గొన్నారు.

బైక్, సెల్‌ఫోన్ అపహరణ

తెనాలి రూరల్: యువకుడిని పరిచయం చేసుకుని అతడి బైక్, సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటనపై సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేమూరు మండలం పెరవలికి చెందిన నాలా బాలరాజు ఈ నెల 25వ తేదీన అదే జిల్లా చుండూరు మండలం ఆలపాడులో పెయింట్ పనికి వెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని యువకుడు పరిచయమయ్యాడు. బాలరాజు బైక్‌పై తెనాలిలో పని ఉందంటూ తీసుకొచ్చాడు. పట్టణంలోకి రాగానే ఇప్పుడే వస్తానని చెప్పి బాలరాజు వద్ద సెల్‌ఫోన్ తీసుకుని అదే వాహనం వేసుకుని వెళ్లిపోయాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు సోమవారం నమోదు చేశారు.

పద్మశాలీయ సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మృతి

తాడేపల్లిరూరల్ (మంగళగిరి) : మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలందించిన మంద్రు వెంకటేశ్వరరావు (86) సోమవారం కన్నుమూశారు. వెంకటేశ్వరరావు పట్టణ మైత్రి సంఘం అధ్యక్షులుగా, గుమాస్తాల సంఘం అధ్యక్షులుగా, వీవర్స్ ప్రాజెక్ట్ సొసైటీ అధ్యక్షులుగా, వాటర్ స్కీమ్ అధ్యక్షులుగా బహుముఖ సేవలు అందించారని పద్మశాలీయ సంఘం నేతలు చెప్పారు. వెంకటేశ్వరరావుకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొన్నాళ్లుగా అస్వస్థతతో ఉన్న వెంకటేశ్వరరావు వయోభారంతో మరణించడంతో నగరంలో పద్మశాలీ సంఘం నేతలు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం 4వ రోజుకు చేరుకున్నాయి. బ్రహ్మో త్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి తిరుమంజన సేవ, హయగ్రీవ హోమం నిర్వహించారు. రామచంద్రమూర్తిని గజవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

డీ ఫార్మసీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ ఫార్మసీ డిప్లొమా కౌన్సెలింగ్‌లో భర్తీ చేయగా మిగిలిన సీట్లకు ఫిబ్రవరి రెండో తేదీన స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఫొటోస్టాట్ కాపీలతో రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందే విద్యార్థినులు ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ ఉండవని పేర్కొన్నారు. దరఖాస్తులను మంగళవారం నుంచి కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి పొందగలరని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో వైద్యం

- పట్టణంలో ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు
- వాటిలో ఇప్పటికే ఒకటి శాశ్వత భవనంలోకి మార్పు
- ప్రారంభానికి సిద్ధంగా పాత ఆస్పత్రిలోని కేంద్రం
- నిర్మాణ దశలో మూడు భవనాలు

ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. డాక్టర్ దగ్గరకు వెళ్లాలంటే పేదలు ఖర్చు భరించలేని పరిస్థితి. వైద్యం కోసం పట్టణానికి దూరంగా ఉన్న జిల్లా ఆస్పత్రికి వెళ్లాలి. దీంతో అధిక శాతం మంది మందుల షాపు, లేక ఆర్‌ఎంపీలే దిక్కు. ఎప్పటి నుంచో పట్టణ నడిబొడ్డున ప్రాథమిక వైద్యశాల ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే శివ కుమార్ కృషి చేస్తున్నారు. ఈ లోగా ప్రభుత్వం అర్బన్ హెల్త్ సెంటర్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణం పూర్తి శరవేగంగా చేస్తున్నారు.

తెనాలి అర్బన్: పట్టణానికి ప్రభుత్వం ఐదు డాక్టర్ వైఎస్సార్ పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లను మంజూరు చేసింది. ప్రస్తుతం వాటిని అద్దె భవనాలలో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. వాటిని శాశ్వత భవనాలలో ఏర్పాటు చేసేందుకు రూ.5.50 కోట్ల నిధులు విడుదల చేసింది.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాత ప్రభుత్వ వైద్యశాలలోని అర్బన్ హెల్త్ సెంటర్

తెనాలి పట్టణంలో గతంలో సాలిపేటలో అర్బన్ హెల్త్ సెంటర్ ఉండేది. ఆ ప్రాంతాలోని వారు మినహా మిగిలిన ప్రాంతాల వారు జిల్లా వైద్యశాలకు వచ్చి సేవలు పొందేవారు. వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్ తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్, పాతప్రభుత్వ వైద్యశాల వద్ద, ఐతానగర్ నేలపాడు రోడ్డులో, ఆలపాటి నగర్, చంద్రబాబు నాయుడు కాలనీలలో ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

నిధులు మంజూరు..

తెనాలి పట్టణంలో నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌ల కోసం రూ.5.50కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దానిలో రూ.80లక్షలు ప్రభుత్వం మిగిలిన రూ.30లక్షలు పురపాలక సంఘ నిధులు కేటాయించింది. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వెయిటింగ్ హాల్, 10 బెడ్స్‌తో వార్డు, ల్యాబ్, మైనర్ ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ గది, లేబర్ రూమ్(ప్రసవాలు చేసే గది), డ్రస్సింగ్ రూమ్, ఓపీ రెండు గదులు, మీటింగ్ హాల్ నిర్మించారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నిషియన్, ఎల్‌జీఎస్‌ను ఏర్పాటు చేశారు.

ప్రారంభానికి సిద్ధం..

తెనాలి పట్టణంలో నిర్మిస్తున్న డాక్టర్ వైఎస్సార్ పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సుల్తానాబాద్, పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని పనులు పూర్తి అయ్యాయి. పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని దానిని వారంలో ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలపాటి నగర్‌లోని సెంటర్ శ్లాబ్ వేశారు. మిగిలిన పనులు చేస్తున్నారు. అలాగే అయితానగర్‌లో శ్లాబ్ పూర్తి చేశారు. చంద్రబాబు నాయుడు కాలనీలోని కేంద్రం శ్లాబ్ వేయాల్సి ఉందని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

శాంతి సహనమే మహాత్ముని మార్గం

తెనాలి రూరల్: శాంతి, సహనమే మహాత్ముని మార్గమని తహసీల్దార్ కె.రవిబాబు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచానికి అహింసా విధానాన్ని తెలియజేసిన గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. గాంధీ సూచించినట్టు శాంతి, సంయమనంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్, డెప్యూటీ తహసీల్దార్ సిద్దెల హెనాప్రియ, మండల విద్యాశాఖ అధికారి మేకల లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ కరిముల్లా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రవిబాబు

ఇసుక లారీ సీజ్

కొల్లిపర: ఎటువంటి వే బిల్లులు లేకుండా నిబంధనలకు తరలిస్తున్న లారీని అన్నవరం గ్రామం కరకట్ట వద్ద సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.రవీంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కృష్ణానది కరకట్టపై వాహనాల తనిఖీలో భాగంగా సిబ్బందితో పరిశీలిస్తుండగా ఇసుకతో టిప్పర్ లారీ వస్తుండగా ఆపి లారీ డ్రైవర్లను వే బిల్లు ఇవ్వమని అడగగా అతను దగ్గర ఎటువంటి సమాచారం లేకపోవడంతో ఇసుకతో ఉన్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నవదిన ప్రార్థనలు



దివ్యబలి పూజ నిర్వహిస్తున్న ఫాదర్ బాలశౌరి

తెనాలి టౌన్: చెంచుపేటలోని నిత్యసహాయ మాత మందిరంలో(ఆర్‌సీఎం) నవదిన ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నిత్యసహాయమాత ఉత్సవాల్లో భాగంలో ఏడు రోజుల నుంచి ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. రెవరెండ్ ఫాదర్ బాలశౌరి సోమవారం దివ్యబలి పూజ సమర్పించారు. బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం అందజేశారు. చర్చి విచారణకర్త ఫాదర్ విజయానంద, ఫాదర్ సాగర్ బాబు, ఫాదర్ మార్టిన్, ఉపదేశి జోషి, అందె మరియదాసు, విన్సెంట్ పాల్ సొసైటీ రోజిలియో, ఆర్థిక కమిటీ సభ్యుడు నిమ్మగడ్డ జోషి బాబు, మరియదళం సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో వ్యక్తిత్వ వికాస శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: అమెరికాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు నిక్ వుజిసిక్ మంగళవారం గుంటూరు నగరానికి రానున్నారు. గుంటూరుకు చెందిన ఎన్ఆర్ గ్రూప్స్ డైరెక్టర్ బొర్రా నరేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని బీఆర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం 4.00 గంటల నుంచి 9,10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్, పీజీ చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు.

పెదపాలెంలో చిరుధాన్యాలపై అవగాహన

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాల మండలం పెదపాలెంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ పి.రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గతంలో 2018లో ఈకార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ప్రస్తుతం మనం తినే ఆహారం రసాయన ఎరువులతో పండించడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని, వివరించారు. చిరు ధాన్యాలైన కొర్రలు, సామలు, అండుకొర్రలు, ఊదలు, రాగులు, సజ్జలు, జొన్నలను పండించడమే కాకుండా వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, గుంటూరు ఏడీఏ జి.ప్రవీణ్, ఏవో ఎస్.శ్రీవాణి, దుగ్గిరాల ఎంపీఓ పి.శిరీష, ఏఈఓలు కె.శ్రీనివాస్, ఎ.రమేష్‌బాబు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ డి.అలేఖ్య, ఎంపీఈఓ సౌమిత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌కు చెందిన టైగర్ పవర్ క్లబ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రతిభ చూపించినట్లు కోచ్ విష్ణుమొలకల సంఘవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న హనుమాన్ జంక్షన్‌లోని కాకాని కల్యాణ మండపంలో జరిగిన ఫస్ట్ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో సుందరయ్యనగర్‌లోని టైగర్ పవర్ క్లబ్‌కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారని, మొత్తం 26 జిల్లాల్లోనూ 800 మందికిపైగా విద్యార్థులు పాల్గొనగా సుందరయ్యనగర్ విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. 63 కేజీల విభాగంలో పెద్దపాటి బేబి భవ్యశ్రీ ప్రథమ స్థానం, మైనస్ 30 కేజీల విభాగంలో నంద్యాల వెంకట శాలిని మొదటి స్థానం, 40 కేజీల విభాగంలో పోలూరు వెంకట వర్ధిని ప్రథమ స్థానం, 35 కేజీల విభాగంలో పట్టేటి ఉదయ్‌కిరణ్ ప్రథమస్థానం, 40 కేజీల విభాగంలో దొంత పవన్ శశాంక్ కుమార్ మొటిస్థానం, 60 కేజీల విభాగంలో చిట్టికిరెడ్డి దినేశ్వర్ ప్రథమస్థానం, 35 కేజీల విభాగంలో ముంజేటి నరేంద్ర మొదటి స్థానం, 30 కేజీల విభాగంలో బంకాల రోహిత్ వెంకట్ కుమార్ మొదటిస్థానం, 45 కేజీల విభాగంలో బంకల మౌర్యతేజ మొదటిస్థానం, 63 కేజీల విభాగంలో మహమ్మద్ అష్ఫునీసా రెండవ స్థానం, 30 కేజీల విభాగంలో ముంజేటి వర్ధిని ద్వితీయ స్థానం దక్కించుకున్నారని ఆమె తెలిపారు.




రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- హిందూ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థుల్ని ఆలోచింపచేసేందుకు అవసరమైన ప్రోత్సాహం లభిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సహకారంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో-2023ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో వైజ్ఞానిక ప్రదర్శన్ల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు ఇటువంటి ప్రదర్శనల్ని నిరంతరం ఏర్పాటు చేయాలని సూచించారు. న్యూయార్క్ తదితర ప్రాంతాల్లో ప్రతి ఏటా తప్పనిసరిగా ఒక ఉత్సవంలా సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహిస్తారని తెలిపారు. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తాను హిందూ కళాశాల పూర్వవిద్యార్థినేనని చెప్పారు. 300 అంశాలతో నగరంలోని 100 పాఠశాలలు, కళాశాలల్ని సమన్వయ పరచి ఆసక్తికర అంశాలతో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర ఉన్న హిందూ కళాశాల అంతే స్థాయిలో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. సభలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, హిందూ కాలేజ్-హైస్కూల్ కౌన్సిల్ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ మన్నవ మాధవి, ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు చిలకా అరుణ, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్ ప్రసంగించారు.



నవరత్నాల వీల్ గేమ్‌ను పరిశీలిస్తున్న ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు

ఆకట్టుకున్న నవరత్నాల ప్రదర్శన

సైన్స్ ఎక్స్‌పోలో భాగంగా కళాశాల అర్థశాస్త్ర విభాగ ఆధ్వర్యంలో డాక్టర్ పి. వేణుగోపాల్, షేక్ హసీనా రూపొందించిన నవరత్నాలు వీల్ గేమ్ సందర్శకులను ఆకట్టుకుంది. వీల్‌ను తిప్పితే అది ఏ పథకం వద్ద ఆగితే, ఆ పథకం గురించి వివరించి చెప్పిన వారికి ఒక బహుమతి ఇచ్చే విధంగా రూపొందించిన ప్రదర్శనను ఆచార్య రాజశేఖర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మేయర్ మనోహర్ నాయుడు పరిశీలించారు.

నేడు, రేపు ప్రదర్శన

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను తిలకించేందుకు సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

నాట్కో ట్రస్టు సేవలు భేష్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు సేవలు బాగున్నాయని జింఖానా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ డాక్టర్ యలవర్తి రామరాజు భూషణుడు, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ సులోచన దంపతులు ప్రశంసించారు. సోమవారం నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను వారు సందర్శించారు.రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాల్ని పరిశీలించారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌లను గుర్తించే వ్యాధి నిర్ధారణ పరికరాలతో పాటు శస్త్ర చికిత్సలకు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ను సైతం నాట్కో ట్రస్టు ఏర్పాటు చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. రేడియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ జి.దుర్గాప్రసాద్, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు సెంటర్‌లో అందిస్తున్న వైద్య సేవల గురించి వారికి వివరించారు.

త్యాగయ్య కీర్తనలు అజరామరం

పాత గుంటూరు: శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు అజరామరమని వాగ్గేయకారుడు మాడభూషి వేదాంత నరసింహాచార్యులు పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య, పద్మావతి కళా వేదికలపై శ్రీ సరస్వతీ సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజస్వామి 175వ ఆరాధనోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదాంత నరసింహచార్యుల శిష్య బృందం 12 గంటల పాటు లఘు అఖండం పేరుతో శ్రీ త్యాగరాజస్వామి సంకీర్తనలు ఆలపించి భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. మారెళ్ల వామన్ కుమార్, డాక్టర్ ఎస్. పావని, సీత, సువర్ణ విద్య, అనూరాధ, గీతారామ్మోహన్, స్నిగ్ధ, నిరుక్త, సుముఖి, ఐశ్వర్య గాత్రంతో అలరించారు. వయోలిన్‌పై పాలేటి గోవర్ధన్, చావలి శ్రీనివాస్, పెరవలి నందకుమార్, మృదంగంపై కె.జగన్మోహిని, బి. సురేష్‌బాబు, ఘటంపై ఎం.హరిబాబు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో ఓగిరాల రామకృష్ణ, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి

కమిషనర్ జశ్వంతరావు

తెనాలి అర్బన్: వార్డు సచివాలయాలకు వచ్చిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఆదేశించారు. పట్టణంలోని 10వ సచివాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ఉన్నతాధికారుల సూచనలను పాటించాలని చెప్పారు. వారు అడిగిన ప్రతి రిపోర్టును సాధ్యమైనంత త్వరగా అందజేయాలన్నారు. ఆయన వెంట మేనేజర్ అప్పలరాజు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ జశ్వంతరావు, మేనేజర్ అప్పలరాజు

ప్రముఖ హరికథ కళాకారుడు కోటేశ్వరరావుకు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం మాయా మచ్చీంద్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం యుగ పురుషుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ హరికథ కళాకారుడు బసరావూరి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరమాచినేని వెంకటేశ్వరరావు, ఇసుకపల్లి ఆనందరావు, పాలడుగు శ్రీనివాసరావు, లింగం సాయికృష్ణ, వీరమాచినేని రమణబాబు, బసరావూరి శివ సీతారామ్, కుక్కిలిగడ్డ సీతామహాలక్ష్మి, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, దేవరపల్లి భవాని, ఈదర శ్రీనివాసరావు, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్, నండూరి శ్రీమహాలక్ష్మి, యల్లాప్రగాఢ పద్మజ, లక్ష్మి, చందు కోటేశ్వరమ్మ, గొడవర్తి లక్ష్మి, అరుణ శ్రీ, వెంకట సుబ్బారావు, మునిపల్లి మధువల్లి పాల్గొన్నారు.



కోటేశ్వరరావును సన్మానిస్తున్న వెంకటేశ్వరరావు, ఆనందరావు తదితరులు

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

తెనాలి అర్బన్: సాలిపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిలు, పలకలు, బలపలు, చాక్లెట్లు, బిస్కెట్లును సోమవారం పంపిణీ చేశారు. కాళిదాసు అజయ్ పృథ్వి జన్మదినాన్ని పురస్కరించుకుని తండ్రి వైఎస్సార్ సీపీ నాయకులు కాళిదాసు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్‌చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కృష్ణబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, నల్లగొర్ల నాగేశ్వరరావు, హరిదాసు గౌరిశంకర్, హెచ్‌ఎం వెంకయమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జ్యోత్స్న, బాలకృష్ణ, మహేష్, తన్నీరు శివశంకర్, పాలడుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తెనాలి అర్బన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హ్యాపీ హాస్పిటల్స్ సంయుక్తంగా చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ పి.అరుణ్‌తేజ, డాక్టర్ మౌనిక సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని ప్రియాంక మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వలన విద్యార్థుల్లో దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటివి ఎక్కువగా కనిపిస్తున్నాయని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని ప్రతి రోజు తాగాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి ముమ్మనేని భానుమతి, హెల్త్ హాస్పిటల్ పీఆర్‌ఓ సురేంద్ర, సాంబయ్య, రాజారెడ్డి, రేష్మి, వెలగా సుభాష్‌చంద్రబోస్, కుమారి పాల్గొన్నారు.



విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని ప్రియాంక

భావనారుషి స్వామికి పవళింపు సేవ

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పద్మశాలీయ కల్యాణ మండపంలోని భద్రావతి సమేత భావనా ఋషి స్వామి కల్యాణం అనంతరం సోమవారం పవళింపు సేవ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పవళింపు సేవా మహోత్సవాన్ని తిలకించారు. విశ్వశాంతి కళాపరిషత్ ఆధ్వర్యంలో పౌరాణిక నాటకం, శివభక్త బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, రాయల గ్యాస్ కంపెనీ అధినేత నన్నపనేని నాగేశ్వరరావు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వూట్ల సాంబశివరావు, మునగాల వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు కుమారస్వామి, మునగాల రమేష్, వెంకటేష్, పొట్లబత్తుని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ మంచా విజయ మోహనరావును, కళాకారులను సత్కరించారు.



కన్నుల పండువగా శ్రీ సీతారాముల కల్యాణం

పాత గుంటూరు: బ్రాడీపేట రెండో లైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం కార్యదర్శి నంబూరి వెంకట నారాయణమూర్తి పర్యవేక్షణలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93వ సంఘ వార్షికోత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీ గంగా భువనేశ్వరి సమేత ఓంకారేశ్వరస్వామికి అభిషేకార్చనలు, సీతా సమేత కోదండ రామస్వామికి తులసి అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు బుజ్జి బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి , మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం విశేషంగా పాల్గొన్న భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. ఇందుమతి బృందం భక్తి సంగీతం ఆకట్టుకుంది. శ్రీమద్రామాయణ ప్రవచనంలో భాగంగా శ్రీ ఆంజనేయ స్వామికి శ్రీ రాముని దర్శనం, సుగ్రీవునితో మైత్రి, వాలిని సంహరించడం, సీతాన్వేషణ, కిష్కింధలోని అనేక సన్నివేశాల్ని మంచికంటి వెంకట సత్యవతి వివరించారు.